## మంచి వార్త

# కలిసితింటే.. కలదు సుఖం



**‘కలిసి ఉంటే** కలదు సుఖం’ అని సామెత. దీన్నే ‘కలిసి వండుకుని తింటే కలుగు సుఖం’ అని మార్చుకుని సహజీవన సౌందర్యానికి కొత్త అర్థాన్ని ఇస్తున్నారు కేరళ కోజికోడ్ వాసులు. అక్కడికి దగ్గర్లోని చేవరంబలంలో కొంతమంది ఉద్యోగస్థులైన దంపతులు ఇటీవల సహకార వంటశాల (కలెక్టివ్ కిచెన్)కు రూపకల్పన చేశారు. ఇది చేవరంబలం మహిళా సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నది. ఈ సహకార వంటశాల భావన తొలుత మొలకెత్తింది మాత్రం పొన్నని పట్టణంలోనే. అక్కడ ఉద్యోగాలు, పనులకు వెళ్లే దంపతులు వంటా వార్పు తమ విలువైన సమయాన్ని తినేస్తున్నదని గ్రహించారు. పరిష్కారంగా అందరూ ఒకే దగ్గర వంట చేసుకుంటే మంచిదని భావించారు. వంటల కోసం కొంత స్థలం సమకూర్చుకున్నారు. పొన్నని స్ఫూర్తిగా తర్వాత మలప్పురంలో సహకార వంటశాల కార్యక్రమం మొదలైంది. కొన్ని నెలల కింద చేవరంబలంలోనూ ఆరంభించారు. దీనివల్ల భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్థులు ఉన్న ఇండ్లకు రోజూ భోజనం సిద్ధంచేసి, దాన్ని అందించే స్థానిక మహిళలకు ఆదాయం సమకూరుతున్నది.‘మరుసటి రోజు ఏం వండాలన్నది ముందే నిర్ణయిస్తాం. బ్రేక్‌ఫాస్ట్‌కు ఇడ్లీ, పుట్టు, చపాతి, అప్పం, ఉప్మా, పూరి, మధ్యాహ్న భోజనానికి అన్నం, పప్పు, కూర, చికెన్, చేపల వంటకాలు ప్రధానంగా ఉంటాయి’ అంటుంది చేవరంబలం వంటశాలలో పనిచేసే భాగ్య. మెనూ, ఆహారం వండటం ఈ వంటశాలలో భాగమైన కుటుంబాల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ఆహారం ఖర్చులు, సిబ్బంది జీతాలను ఆయా కుటుంబాల వాళ్లే భరిస్తారు. బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం ఉదయం 8 గంటకల్లా సిద్ధం చేసి, ఇండ్లకు చేరవేస్తారు. ‘ఈ విధానం వల్ల సమయం ఆదా అవుతున్నది. వంట ఖర్చు కూడా కలిసి వస్తున్నది. వ్యర్థాలు, వృథా తగ్గుతున్నాయి. వంటశాలకు అనుబంధంగా సేంద్రియ వ్యర్థాలను కంపోస్ట్ చేసే సదుపాయం కూడా ఉంది’ అంటారు చేవరంబలం సహకార వంటశాల నిర్వాహకుల్లో ఒకరైన శశి కేపీ. నిజమే! ఉద్యోగాల కోసం బయటికి వెళ్లే దంపతులకు, ఇంట్లోనే ఉండే వృద్ధులు, పిల్లలకు సమయానికి భోజనం అందాలంటే సహకార వంటశాలను మించిన ప్రత్యామ్నాయం లేదు. ఈ ప్రయోగం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయి. కేరళలోని ఇతర ప్రాంతాల్లోనూ ఈ విధానం నెమ్మదిగా వేళ్లూనుతున్నది.

## వైతాళికుల వాణి

సంవత్సరంలోని ప్రతిరోజూ అత్యుత్తమమైనదనే విషయాన్ని మీ హృదయ ఫలకంపై ముద్రించుకోండి.

• **రాల్ఫ్ వాల్డో ఎమర్సన్**
(అమెరికా తత్వవేత్త)

## క్యా బాత్‌హై!

